నీటి సమస్య లేకుండా చూడాలి



జీఎంను సన్మానిస్తున్న నరేందర్‌రెడ్డి

మణికొండ: ప్రజలకు నీటి సమస్యల రాకుండా చూడాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి కోరారు. మణికొండ జలమండలి 18వ డివిజన్‌కు నూతనంగా వచ్చిన జీఎం రవీందర్‌రెడ్డిని ఆయన మంగళవారం కలిసి సన్మానించారు. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేయటంతో పలు కాలనీల ప్రజలకు నీరు సరిపోవటం లేదని నీటి సరఫరా సమయంతో పాటు ప్రెషర్‌ను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రామకృష్ణారెడ్డి, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి. రవికాంత్‌రెడ్డి, నాయకులు జె.సిద్దప్ప, సి.బీరప్ప, జి.వినోద్, రవిసాగర్ పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు స్వాగతం



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉమ్రాయాత్రికులు

శంషాబాద్: మొహర్రం సమయంలో ఉమ్రా యాత్రకు వెళ్లిన తొలిబృందం యాత్రను ముగించుకుని తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా వారికి శంషాబాద్ విమానాశ్రయంలో వారి కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. యాత్రను అల్‌మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షించారు.

రోడ్డుపై నిలిచిన వరద



అత్తాపూర్: అత్తాపూర్ ప్రధాన రహదారి హనుమాన్ దేవాలయం మూసీ సర్వీస్ రోడ్డు మార్గం లంగర్‌హౌస్ బ్రిడ్జి సమీపంలో వరద నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా బ్రిడ్జి సమీపంలో వరద పారే సరైన మార్గం లేకపోవడంతో రోడ్డుపైనే నిలిచిపోతోంది. లంగర్‌హౌస్ బాపూఘాట్ నుంచి అత్తాపూర్ మూసీ మార్గం గుండా వెళ్లే వాహనదారులు నానా ఇక్కట్లు పడుతూ రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో కార్వాన్, జియాగూడ, నానల్‌నగర్, గోల్కొండ డివిజన్లకు చెందిన వారికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..శస్త్ర చికిత్సలకు అవసరమైన రోగులకు ఇతర వైద్య సహాయానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, ఎయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.

బసవతారకనగర్‌లో సీపీఎం నాయకుల పర్యటన

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ బసవతారకనగర్‌లో సీపీఎం నాయకులు మంగళవారం పర్యటించారు. సీపీఎం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర నాయకుడు డీజీ నర్సింహారావు, సీపీఎం నాయకులు బస్తీవాసులతో మాట్లాడారు. గుడిసెవాసుల సమస్యలు తీరే వరకు అండగా ఉంటామని, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పగడాల యాదయ్య, నాయకులు శోభన్, కృష్ణ, అతీక్, జార్జ్‌కృప, అనీల్, శ్రీనివాస్, జంగయ్య, శివుడు తదితరులు పాల్గొన్నారు.

మహా నేతకు ఘన నివాళి



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



వెళాంగనీ కాలనీలోని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

వాడవాడలా వైఎస్సార్ జయంతి వేడుకలు

రాజేంద్రనగర్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి ఉత్సవాలను మంగళవారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని విగ్రహాలతో పాటు చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. శివరాంపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో వై.ఎస్.వీరాభిమాని సందీప్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అనాథ ఆశ్రమంలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. వైఎస్సార్ అభిమానులు సోమ శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, రత్నం, సోమ సందీప్, రవి తదితరులు పాల్గొని వై.ఎస్.విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

శివరాంపల్లి వద్ద..

వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి సందర్భంగా శివరాంపల్లిలోని వై.ఎస్.జగన్ అభిమాని వినయ్ కుర్మా ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సాయినాథ్, జగదీష్ కుమార్, అజయ్ కుమార్, అరుణ్ కుమార్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

వెళాంగనీ కాలనీలో..

శంషాబాద్: దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను పట్టణంలోని వెళాంగనీ కాలనీలోని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైఎస్సార్ అభిమాన సంఘం నాయకులు వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. శంషాబాద్ విమానాశ్రయం, ఔటర్ రింగురోడ్డు నిర్మాణంతో శంషాబాద్‌కు అంతర్జాతీయ ఖ్యాతినందించిన ఘనత రాజశేఖర్‌రెడ్డిదే అని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్, సీనియర్ నాయకులు ఎం.డి అక్రమ్‌ఖాన్, జి.బి.శ్రీధర్, పాల్స న్, నజీరుద్దీన్, రమేష్, శ్రీధర్‌యాదవ్, నజ్మొద్దీన్, చిరంజీవి పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వినయ్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. 100 రోజుల ప్రణాళిక ఒక మార్పు అభివృద్ధికి మలుపు కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌లోని సాయిరాంనగర్ కాలనీలో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. 15వ డివిజన్‌లోని రఘురాంనగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ యాదయ్య, ఏఈఈ రాజ్‌కుమార్, వెంకటేష్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ స్వాతి పాల్గొన్నారు.

డిప్లొమా కౌన్సెలింగ్ ప్రారంభం

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. ర్యాంక్ ప్రకారం మొదటి సీటు శ్రీవర్ధన్ అనే విద్యార్థికి ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ రమణారావు, మల్లారెడ్డి, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఆదివారం గంగాపూర్ దత్తాత్రేయ ఆలయానికి బస్సు

మియాపూర్: మియాపూర్ ఆర్టీసీ–2 డిపో పరిధిలో ప్రతి ఆదివారం పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. మియాపూర్ నుండి జహీరాబాద్ మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని గంగాపూర్‌లో శ్రీ దత్తాత్రేయ ఆలయానికి ప్రతి ఆదివారం బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ బస్సులు ఈ నెల 13వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 5 గంటలకు మియాపూర్ నుండి బయల్దేరుతుందని తెలిపారు. 30 మందికి పైగా భక్తులుంటే ఏరోజైనా ప్రత్యేక బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. వివరాలకోసం 9059162162, 9959226420 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

గచ్చిబౌలి: ప్రేమ విఫలమై ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన ప్రకారం .. ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న సాక్షం రాజ్(28)కొవల్లురీస్ ద కాసా అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. మంగళవారం ఉదయం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రేమ విఫలం కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుందని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

నాణ్యతలో మేటి భారతి అల్ట్రాఫాస్ట్



తాపీ మేస్త్రీలకు బీమా బాండ్లు అందజేస్తున్న దృశ్యం

శంషాబాద్: భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ నాణ్యతో ఎంతో మేలైందని సంస్థ టెక్నికల్ ఇంజనీర్ మహ్మద్ సొహెర్ అలీ తెలిపారు. పట్టణంలోని మహాలక్ష్మీ స్టీల్ ట్రేడర్ డీలర్ దుకాణంలో ఏర్పాటు చేసిన తాపీ మేస్త్రీల సమావేశంలో ఆయన మాట్లాడారు.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ప్రధానంగా పిల్లర్లు, బ్రిడ్జి, రహదారులకు నాణ్యమైన ఎంపిక అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సాయం అందుంతుందన్నారు. డీలర్ రాజేందర్ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీసులు వేగవంతంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా మేస్త్రీలకు రూ. 1 లక్షల ప్రమాద బీమా బాండ్లను అందజేశారు.

సన్మానం



నిర్వాహకులను సన్మానిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: తలసీమియా బాధిత విద్యార్థులకు ఉచిత విద్యనందించినందుకు ఎం.ఎస్.ఎడ్యుకేషన్ అకాడమీ నిర్వాహకులను ఘనంగా సన్మానించారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న విద్యార్థుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఎం.ఎస్. ఎడ్యుకేషన్ అకాడమీ తన ఎం.ఎస్.క్రియేటివ్ స్కూల్, ఎం.ఎస్.జూనియర్ కాలేజీ, ఎం.ఎస్.డిగ్రీ కాలేజీల్లో ఉచిత ప్రవేశాలను కల్పిస్తుంది. ఇప్పటి వరకు శతాధిక విద్యార్థులు ఈ సేవలను పొందుతూ విద్యను కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా తలసీమియా రోగులకు అవసరమైన రక్తం అందించేందుకు తరచూ రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంత్ అగర్వాల్, రత్నావళి కోటపల్లి, డాక్టర్ సుమన్ జైన్, ఎం.ఏ.అలీం బేగ్, మహ్మద్ అమీన్, అబూఐమల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు బెంచీలు వితరణ



కార్యక్రమంలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, దాత అఖిల్‌గౌడ్

రాయదుర్గం: స్వర్గీయ కొమరగొని శంకర్‌గౌడ్ జ్ఞాపకార్థం గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలకు బెంచీలు, ఆఫీస్ టేబుళ్లను ఆయన కుమారుడు కొమరగొని వెంకటేష్‌గౌడ్ అఖిల్‌గౌడ్ ,మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి అందజేశారు. ఆర్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రాజశేఖర్‌రెడ్డి, శ్యామల, ఉపాధ్యాయులు నరహరి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఈశ్వరయ్య, సుధాకర్, అరుణ్, కిషోర్, నవీన్,ప్రభాకర్, సత్తయ్య, పవిత్రమ్మ పేర్కొన్నారు.

ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐ (యూ) కార్యదర్శివర్గ సభ్యులు మట్టయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మట్టయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేస్తామని అధికారంలో వచ్చి, ఒక ఉచిత బస్సు మాత్రమే అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. మిగతా హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇల్లు, వికలాంగులకు రూ.6 వేలు, వితంతువులకు రూ. 4 వేల హామీల సంగతి ఏంటని ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐ (యూ) నాయకులు వనం సుధాకర్, సుకన్య, కళావతి, తుకారాం నాయక్, దానయ్య, విమల, లలిత, అనిత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌గూడలో ఆక్రమణల కూల్చివేత



ఆక్రమణలను కూల్చివేస్తున్న అధికారులు



కూల్చివేతలకు అడ్డుపడుతున్న మహిళ

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలో హైదర్‌గూడలో ఆక్రమణలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. 1094 గజాల స్థలాన్ని కబ్జాల చేర నుంచి స్వాధీనం చేసుకున్నారు. హైదర్‌గూడ ఏజీ ఆఫీసు కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వాళ్లు 2001లో నలందనగర్ కాలనీ పేరిట లేఔట్ చేశారు. అప్పట్లో హుడా అనుమతి పొందిన లేఔట్ ఇది. ఇందుకోసం భూమిని అమ్మిన వారే పక్క ఉన్న వాళ్ల సొంత భూమిలో భాగమని పేర్కొంటూ నలందనగర్‌కు చెందిన స్థలాన్ని కబ్జా చేశారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన మా స్థలం కబ్జాకు గురైందని నలందనగర్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపించిన హైడ్రా 1094 గజాల స్థలం నలందనగర్‌కు చెందినదిగా నిర్ధారించి మంగళవారం అక్కడ ఉన్న ప్రహరీ షెడ్డును తొలగించారు. ఈ క్రమంలో ఆక్రమణకు పాల్పడిన వారు అడ్డుకునే ప్రయత్నం చేసి ఆందోళనకు దిగారు. రాజేంద్రనగర్ పోలీసులు రంగంలోకి దిగి వారిని అదుపులోకి తీసుకున్నారు.

భక్తులకు ఇబ్బందులు రానివ్వొద్దు



దేవాలయం వద్ద పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి, మాన్సూన్, రాంకీ, హైడ్రా అధికారులతో కలిసి మంగళవారం ఆయన వివిధ దేవాలయాల పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆదివారం బోనాల పండుగ సందర్భంగా దేవాలయ పరిసర ప్రాంతాల్లో రోడ్లు, రహదారుల మరమ్మతు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. సోమ, మంగళవారం పల్లె చెరువు ఊర పోచమ్మ, కట్ట మైసమ్మ దేవాలయంలో బోనాలు జరుగుతాయని జీహెచ్‌ఎంసీ తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బలరామ కృష్ణ ప్రకాశ్, భాస్కర్, అనిల్‌ముదిరాజ్, ప్రతాప్‌రెడ్డి, సురేష్‌ముదిరాజ్, పాండుయాదవ్, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి సూపర్‌వైజర్ లోక్‌నాథ్ పాల్గొన్నారు.

సర్కారు భూమిలో బోర్డుల ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

శంషాబాద్ రూరల్: మండలంలోని సుల్తాన్‌పల్లిలో అక్రమార్కుల చెరవీడిన ప్రభుత్వ భూమిలో మంగళవారం రెవెన్యూ అధికారులు బోర్డులను ఏర్పాటు చేశారు. సర్వే నంబర్లు 129, 142లోని 25 ఎకరాల 10 గుంటలు ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ ఈ భూమిల్లోకి ఎవరైనా ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో కొందరు అక్రమంగా పట్టా పాసుపుస్తకాలు జారీ చేయించుకుని విక్రయించారు. ఈ విషయంలో గ్రామస్తులు సీసీఎల్‌ఏలో ఫిర్యాదు చేసి ఆధారాలు అందజేశారు. రికార్డులను పరిశీలించిన సీసీఎల్‌ఏ కమిషన్ సదరు భూములు ప్రభుత్వానికి చెందినవి పేర్కొంటూ ఆదేశాలు జారీ చేయడంతో మంగళవారం బోర్డులు ఏర్పాటు చేశారు.

బోనాలకు ఘనంగా ఏర్పాట్లు



బోనాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న అశోక్‌యాదవ్

మణికొండ: ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని నిర్వహించే అమ్మవారి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్ అన్నారు. మంగళవారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని దేవాలయాల వద్ద 17న నిర్వహించే బోనాల పండగ ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి ఆషాఢ మాసంలో గ్రామదేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్, సాయిరాం, కొలాష్, వార్డు అధికారి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల పాలిట కొంగుబంగారం..

జగదాంబ అమ్మవారు

నిజాం కాలం నుంచి పూజలందుకుంటున్న అమ్మవారు

- ఇప్పటికే పూర్తయిన బోనాల ఏర్పాట్లు
- పూజల్లో భాగంగా విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అమ్మవారు

చార్మినార్: సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయం అమ్మవారి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో కొలవుదీరిన గణపతి విగ్రహానికి కిరీటంతో పాటు ఇతర ఆభరణాలను 1.5 కిలోల బరువు గల వెండి ఆభరణాలను చేయించి సమర్పించారు. ఈ నెల 20న అమ్మవారికి బోనాల సమర్పించిన అనంతరం మరుసటి రోజు పాతబస్తీ వీధుల్లో అమ్మవారి ఘటాల పరిసమాప్తి సామూహిక ఊరేగింపును వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారీ తెలిపారు.

శతాబ్దాల క్రితం శీతల్ మాతాగా..

పిల్లాపాపలను ఆయురారోగ్యాలతో చల్లంగా చూసే అమ్మవారు శీతల మాత. సుల్తాన్‌షాహిలో వెలసిన ఈ అమ్మవారిని భక్తులు శీతల్ మాతగా..సిత్లా మాతగా కొలుస్తున్నారు. ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయంలో పూజలు చేస్తే పిల్లలు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖఃసంతోషాలతో గడుపుతారని భక్తుల విశ్వాసం. నిజాం నవాబు పాలనలో ఆర్థిక లావాదేవీలు చూసే అధికారిగా ఉన్న శాలిబండ దేవ్‌డీ నివాసైన రాజా కిషన్ పరిషాద్ ఈ అమ్మవారి ఆలయాన్ని సుల్తాన్‌షాహిలో పునరుజ్జీవం కల్పించారు. అప్పట్లో శీతల్ మాతాగా పిలిచే వారు.

1976 నుంచి జగదాంబ ఆలయంగా..

1976లో ఆలయ కమిటీ ఏర్పడిన అనంతరం..ఈ ఆలయానికి జగదాంబ ఆలయంగా నామకరణం చేశారు. అప్పటి నుంచి ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ఎంతో చారిత్రక ప్రాధాన్యత గల జగదాంబ ఆలయంలో కొలువుదీరిన అమ్మవారికి స్థానిక భక్తులు భక్తిశ్రద్ధలతో బోనం సమర్పిస్తారు. అమ్మవారిని ఒక్కసారి దర్శించుకుంటే ఆయురారోగ్యాలు కలుగుతాయనే భక్తుల నమ్మకం.

ఈసారి ఘనంగా బోనాలు..



ఈసారి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశాం. ఈ నెల 20న బోనాల సమర్పణ, 21న అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు కార్యక్రమాలుంటాయి.

– రాకేశ్ తివారీ, జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్